క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ తొర్రూర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉ. 8గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఆర్ఆర్ కాలనీ, కుర్మ బస్తీ, ఎస్సీబస్తీల్లో కరెంటు ఉండదన్నారు. అలాగే, రంగనాయకుల గుట్ట ఫీడర్ ఉ.10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు మైత్రివనం, బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లి అగ్రికల్చర్ లైన్, కోహెడ, తొర్రూర్ అగ్రికల్చర్ లైన్‌లో విద్యుత్ నిపివేయనున్నట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లి, ఆదిబట్ల సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాలో నిలిచిపోనున్నట్లు ఆదిబట్ల విద్యుత్ శాఖ ఏఈ జయన్న పేర్కొన్నారు. 11కేవీ ఆదిబట్ల అగ్రికల్చర్‌ఫీడర్, మంగళ్‌పల్లి నుంచి ఎల్మినేడు సరఫరా అయ్యే విద్యుత్ లైన్ల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామన్నారు. ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆదిబట్లలోని బోరుబావులు, మమ్మరాజుగూడెం, ఎల్మినేడు ఫీడర్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లల్లో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు నరివేయుటతో పాటు మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉ.10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంటలకు వరకు పెద్దఅంబర్‌పేట టౌన్, శివగంగా కాలనీ, భువనేశ్వరీనగర్, స్వగృహా వెంచర్, అంబికానగర్, పోలీస్‌కాలనీ, హనుమాన్ నగర్, వినాయకనగర్, మైత్రీ సిరిపురం కాలనీల్లో.. అదే విధంగా కోహెడా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సాయికాలనీ, లక్ష్మీకుటీర్, శిలిప్కాలనీ, బ్యాంక్‌కాలనీ, యాదాద్రినగర్, శాంతినగర్, బలిజగూడ రోడ్డు, సదాశివ, తారా హోమ్స్, హరిహరపురం కాలనీ, కోహెడా రోడ్డు పరిసర ప్రాంతాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయన్నుట్లు ఏఈ చంద్రమౌళి తెలిపారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు పట్టణంలో ఈనెల నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ సీతారాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 33 కేవీ ఫీడర్ లైన్‌లో చెట్ల తొలగింపు ఉన్నందున ఉ.7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రిజర్వేషన్లతోనే బీసీలకు న్యాయం

వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేష్



ఇబ్రహీంపట్నం: బీసీ జాబితాలోని ఏబీసీడీ వర్గీకరణ ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లలో సీట్లు కేటాయించాలని రాష్ట్ర వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి విఘ్నేష్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బీసీ కుల గణన చేపట్టి రిజర్వేషన్లను పెంచాలన్నారు. బీసీల్లోని కొన్ని కులాలవారికి రాజకీయంగా ఎలాంటి అవకాశాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన తరగతుల్లోని ఏబీసీడీ వర్గీకరణ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తే అన్నివర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించినట్లు అవుతుందని చెప్పారు. బీసీలోని అన్నికులాల వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మళ్లీ తీవ్రమైన ఎండలు

ఇబ్రహీంపట్నం: మళ్లీ ఎండలు దంచికొడుతున్నాయి. గడిచిన రెండు రోజులుగా ఇబ్రహీంపట్నంలో ఎండలు మండిపోతున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఓ మోస్తారు వర్షాలు ఇటీవల కురవడంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. గత రెండు మూడు రోజులుగా భానుడి ప్రతాపం మళ్లీ తీవ్రం కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడికి మధ్యాహ్న సమయంలో రోడ్లపై జనసంచారం తగ్గిపోయింది. వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లకు విరామం లేకుండా పోయింది. రోహిణి కార్తె ముగిసే వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మాడ్గుల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (శుక్రవారం) మండల సాధారణ సర్వసభ్యసమావేశం నిర్వహించనున్ననట్లు ఎంపీడీఓ సరస్వతీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశం ఉ.11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

'అమ్మ ఆదర్శ'మవుతోంది..

ప్రభుత్వ బడులకు సొబగులు

- మరమ్మతులకు నిధులు మంజూరు
- జోరుగా సాగుతున్న పనులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో లేని విధంగా వసతులు కల్పనకు కార్యరూపం దాల్చింది. ఇప్పటికే ప్రభుత్వ విద్యా విధానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వేసి, తద్వారా బడులపై పర్యవేక్షణకు కృషి చేస్తోంది. అందులో భాగంగా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించింది. మౌలిక సదుపాయలు కల్పించి పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తోంది.

మండలంలో 24 బడులు ఎంపిక

ఇబ్రహీంపట్నం మండలం, ఆదిబట్ల మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల్లో 24 బడులను ఎంపిక చేసింది. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో-7, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో -4, ఇబ్రహీంపట్నం మండలంలో 13 పాఠశాలలకు మరమ్మతులు చేపట్టింది. ఒక్కో పాఠశాలకు లక్ష రూపాయల చొప్పున 24 బడులకు రూ.24 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. మూత్రశాలలు, తాగునీరు సౌకర్యం, ఫ్యాన్లు, విద్యుత్, యూనిఫాంలు కుట్టడం, రంగులు వేయడం లాంటి సౌకర్యాలు కల్పించాలి. ఇప్పటి వరకు ఉప్పరిగూడ ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ చర్లపటేల్‌గూడ, ఎంపీయుపీఎస్ నెర్రపల్లి, ఎంపీపీఎస్ దండుమైలారం, ఎంపీయుపీఎస్ ముకునూర్, ఎంపీపీఎస్ ఎన్గల్‌గూడ, పోచారం, ఎంపీపీఎస్ ఎల్మినేడు, తుర్కగూడ, తులేకలాన్, కొంగరకలాన్, బొంగ్లూర్, రాందాస్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కెవీతండా, వెంకటరమణ కాలనీ, మంగళ్‌పల్లి, ఎంపీపటేల్‌గూడ, సాహెబ్‌గూడఖానాపూర్ బడుల్లో చురుకుగా పనులు కొనసాగుతున్నాయి.

నోడల్ అధికారి నియామకం

అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ కోసం మండలంలోని రాయపోల్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌ని నోడల్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ పథకం సమగ్రంగా అమలు కావడం కోసం కమిటీలతో పాటు నోడల్ అధికారి పాత్ర కీలకం కానుంది. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఇంద్రాసేనారెడ్డి, ఆదిబట్ల మున్సిపాలిటీలో వీరాంజనేయులు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గుణాకర్ ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు సాగనున్నాయి. ఎక్కడ ఎలాంటి జాప్యం లేకుండా పనులు చేయించడానికి వీరి పాత్ర కీలకం.



పోచారం బడిలో ఫ్యాన్ల బిగింపు

ఆసక్తి పెరుగుతోంది..



సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు బడులపై నమ్మకం కలిగేలా చేస్తుంది. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా అమలు కాబోతుంది.

–మర్రి నిరంజన్‌రెడ్డి, చైర్మన్ ఆదిబట్ల మున్సిపాలిటీ

పనులు జరుగుతున్నాయి



మండలంలో 24 ప్రభుత్వ పాఠశాలలు మొదటి విడతలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికయ్యాయి. నిధులు కూడా ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమ చేశారు.బడులు తెరిచే నాటికి పూర్తి చేస్తాం. ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

– వెంకట్‌రెడ్డి, మండల విద్యాధికారి, ఇబ్రహీంపట్నం

జూన్ 12లోపు పూర్తి చేయాలి

డీఆర్‌డీఏ ఏపీడీ సూర్యారావు



దుస్తులను పరిశీలిస్తున్న సూర్యారావు, ఏపీఎం

తలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత ఏకరూప దుస్తులను కుట్టిస్తున్నామని డీఆర్‌డీఏ సూర్యారావు తెలిపారు. మండల కేంద్రంలోని కుట్టు మిషన్ కేంద్రాలను ఏపీఎం శ్రీదేవితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 2666 మంది విద్యార్థులకు 2600 డ్రెస్‌లు కుట్టిస్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 500 డ్రెస్‌లు కుట్టించామన్నారు. జూన్ 12న నాటికి పూర్తి చేయాలని చెప్పారు. కుట్టులో నాణ్యత, మెళకువలు, కట్టింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీదేవి, సీసీలు, సమాఖ్య సిబ్బంది, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే



తలకొండపల్లి: ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండలంలోని కర్కాస్ తండాకు చెందిన కృష్ణనాయక్ బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ తదితరులున్నారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని పడమటి తండాకు చెందిన చాంప్లి (45) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గద్రు, దాస్య, హన్యా, రాములు, ఘన్యా, దేవ్యా పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తలపించేలా..



డంపింగ్ యార్డ్‌గా మారిన మార్కెట్ స్థలం

తుర్కయంజాల్: అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పలు వివాదాల కారణంగా నేటికి పనులు కార్యరూపం దాల్చని విషయం తెలిసిందే. మార్కెట్ కోసం కేటాయించిన భూమిని మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డ్‌గా మార్చేశారు. పలు కాలనీల నుంచి సేకరించిన చెత్తను తెచ్చి ఇక్కడ డంప్ చేస్తుండటంతో ఆ ప్రాంతం అంతా చెత్తమయంగా మారింది. చెత్తను బహిరంగంగా తగలబెడుతుండటంతో దుర్వాసన వెదజల్లుతుందని చుట్టూ పక్కల కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అరుణకు ఇందిరాగాంధీ ఎక్సలెన్సీ అవార్డు

ఆమనగల్లు: కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన జానపద గాయకురాలు బద్రిపల్లి అరుణకి ఆలురి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులు, కవులు, సంఘసేవకులకు ఆలురి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఇందిరాగాంధీ ఎక్సలెన్స్ అవార్డులు అందిస్తున్నారు. ఈ ఏడాది జానపద విభాగంలో అరుణను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, సినీ నిర్మాత అచ్చిరెడ్డి, అధ్యక్షుడు డా.ఆలూరి విల్సన్, గౌరవాధ్యక్షురాలు అంజనీకుమారి, ప్రధాన కార్యదర్శి డా.ఇందిర జానపద గాయకురాలు అరుణకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అరుణను జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అభినందించి సత్కరించారు.



అవార్డు అందుకుంటున్న అరుణ

కనుల పండువగా లక్ష్మీనృసింహుడి కల్యాణం



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జడ్పీటీసీ వెంకటేశ్, తదితరులు



కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, తదితరులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా శావ తీశారు. ఆలయ నిర్వాహకులు సమకూర్చిన పట్టు పీతాంబుర వస్త్రాలను దేవతామూర్తులకు కట్టి కల్యాణ వేడుకలకు ముస్తాబు చేశారు. వేద పండితులు మంత్రాలు వల్లిస్తుండగా ముత్యాల తలంబ్రాలతో మంగళసూత్రం దారణ గావించారు. పరిసర ప్రాంతాల నుంచి, పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణం తిలకించారు. లక్ష్మీనృసింహస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది.

హాజరైన ప్రముఖులు..

స్వామి కల్యాణానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. నిర్వాహకులు వారిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. వేద పండితులు, వేద ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడుస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్, ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ్మ, ఎంపీటీసీ హేమరాజు, శ్రీశైలంగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్లు శేఖర్, యాదయ్య, దేవులానాయక్, వేద పండితులు శ్రీనివాసామూర్తి శర్మ, శ్రీశైలం గౌడ్, ఈశ్వర్, విఠల్, దశరథం, భక్తులు, పాల్గొన్నారు.

అధిక ఫీజులను కట్టడి చేయండి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకృష్ణ

యాచారం: ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, అలాగే ఎక్కువ ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలపై నిఘా పెట్టాలని కోరారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ అనుమతులు లేకున్నా అడ్మిషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దశాబ్ది

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మూడు రోజుల పాటు నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్నె అరవింద్ కోరారు. ఇబ్రహీంపట్నంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జూన్ 1న నగరంలోని గన్‌పార్కు వద్ద అమరవీరులకు నివాళులర్పించి అమరజ్యోతి ర్యాలీ నిర్వహిస్తారని, జూన్ 2న తెలంగాణ భవన్‌లో ఉ. 9 గంటలకు జాతీయ జెండాను, పార్టీ జెండాను కేసీఆర్ ఎగురవేస్తారని చెప్పారు. అనంతరం కళింగ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమ ఘట్టాల ఫోటో ఎగ్జిబిషన్‌తో పాటు పార్టీ శ్రేణులను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగిస్తారని తెలిపారు. 3వ తేదీ రాష్ట్రంలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాలల్లో పార్టీ జెండాలను ఎగురవేసి నియోజకవర్గ, మండల కేంద్రాలల్లో గల ఆస్పత్రులోని రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ మూడు రోజుల పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బుగ్గరాములుతోపాటు భర్తకి రాజు, బుచ్చిరెడ్డి, గరిగే శేఖర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత కర్నె అరవింద్

మురుగు పారదు.. దోమ వదలదు..

- కుంటను తలపిస్తున్న మురుగు నీరు
- దుర్వాసనతో ప్రజల అవస్థలు



మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన మురుగు కాలువ



కాటమయ్యగడ్డ సమీపంలో కుంటను తలపిస్తున్న మురుగునీటి కాలువ

మాడ్గుల: మండల కేంద్రంలో మురుగు కాలువలు చెత్తతో నిండిపోయి మురుగు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చెత్తను తొలగించాలని ప్రజలు వేడుకుంటూన్నారు. మాడ్గుల నుంచి కలకోండ మధ్య వెళ్లే కాటమయ్యగడ్డ సమీపంలో మురుగు కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో నిండి పోయి, దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారింది. వ్యర్థాలతో కాలువలు నిండి మురుగు నీరు పోకుండా జాం అయినప్పటికీ కాలువల్లో పూడిక తీయించడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి మురుగునీటి కాలువల్లో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఇళ్ల సమీపంలోకే మురుగు నీరు రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అండర్ డ్రైనేజీ నిర్మించండి..



మండల కేంద్రంలో కాటమయ్యగడ్డ సమీపంలో మురుగు కాలువలో అండర్ డ్రైనేజీ నిర్మించండని పలుమార్లు అధికారులకు, పాలకులకు విన్నవించాం.. అయినా పట్టించుకోలేదు, అధికారులు, పాలకులు స్పందించి సమస్యను పరిష్కరించాలి

–శివ, మాడ్గుల

కుంటను తలపిస్తున్న కాలువ



మురగునీరు ఇంటి ఎదుట నిల్వ ఉండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దుర్గంధంతో ముక్కు మూసుకోని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.. డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా నివారించాలని అధికారులను కోరుతున్నారు.

– రాజు, మాడ్గుల

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి



తలకొండపల్లి: ర్యాలీ తీస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

తలకొండపల్లి: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు, లింగరావుపల్లి, వీరన్నపల్లి, చంద్రధన, పూల్‌సింగ్ తండా, చెన్నంపల్లి, తదితర గ్రామాల్లో అధికారులు విత్తన కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే, ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలున్నా, తడిసినా కొనుగోలు చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు విజయ్, శ్రీనాథ్, శ్రీకాంత్, నిఖిత, శిరిష, అనిత పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

మంచాల: పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ నోడల్ ఆఫీసర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. సమయానుకూలంగా పంటలను సాగు చేసి చీడ, పీడ వంటి తెగులు సోకకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, మంచాల మండల వ్యవసాయాధికారి జ్యోతి శ్రీ, ఏఈఓ లింగ స్వామి, వాటర్ సంస్థ ప్రతినిధి కృష్ణ,కృషివిజ్ఞాన కేంద్ర ప్రతినిధులు హరిక రెడ్డి, సునిత పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

ఆమనగల్లు: రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు, మెలకువలను పాటించి అధిక దిగుబడులను సాధించాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మండలంలోని సంకటోనిపల్లి, ఆకుతోటపల్లి, సింగంపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో.. విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాధమ్మ, మాజీ ఎంపీపీ ధనుంజయ, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీపాల్, రైతులు వెంకటయ్య, శేఖర్‌రెడ్డి, ఏఈఓలు రాణి, సాయిరాం, శివతేజ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఏఓ అరుణకుమారి తనిఖీ చేశారు.